
కథ

# ఆమె నవ్విన నవ్వు

– పంతం సుజాత



**"ఎంతకీ లొంగని ఆడదాని శీలం మీద మచ్చవేసి సంతృప్తి పడతాడు మగవాడు". పదహారేళ్ళ వయసులో నాయనమ్మ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. సౌమ్యకి. ఆ మాటల అర్థం అప్పుడు కాకపోయినా ఇప్పుడు తెలుస్తోంది. గాయత్రి వైపు సాలోచనగా చూస్తూ అంది సౌమ్య.**

"చెప్పు, ఇంకేం అన్నాడు?"

సౌమ్య వైపు సందిగ్ధంగా చూసింది గాయత్రి.

"నువ్వు హర్ట్ అవ్వకూడదు మరి" అంది.

"అవ్వనులే చెప్పు" బలవంతంగా నవ్వబోయింది సౌమ్య. కాని నవ్వు రాలేదు. గాయత్రి చెప్పసాగింది.

"ఆ సెక్షన్ హెడ్ సుధాకర్ ఎందుకో నీమీద కక్షగట్టాడు. లేకపోతే నీకూ, మేనేజర్‌కీ సంబంధం అంటగడతాడా వెధవ? అక్కడికీ వాడు చెబుతుంటే నేను తిట్టాననుకో! అసలు ఏం జరిగింది?" ఆరాగా అడిగింది గాయత్రి.

సౌమ్య దీర్ఘంగా నిట్టూర్చింది.

"ఈ సుధాకర్ ఒకటి, రెండు సార్లు వెకిలి చేష్టలు చేస్తే తిట్టాను. దాంతో మేనేజర్ తనకి బాగా తెలుసని, ఉద్యోగం తీయించేస్తానని బెదిరించాడు. నేను డైరెక్ట్‌గా మేనేజర్‌ని కలిసి విషయమంతా చెప్పేసరికి ఆయన తిట్టాడు. బహుశః ఆ కోపం అయి వుండవచ్చు" అంది సౌమ్య.

"మరి నీ బాధలన్నీ తనతో చెప్పకుంటావని అన్నాడు. పైగా నీ భర్తంటే నీకిష్టం లేదని, తప్పక అతనితో కలసి వుంటున్నావనీ చెప్పాడు..." గాయత్రి మాట పూర్తి కాకుండా..

"అబద్ధం" గట్టిగా అరచినంత పని చేసింది సౌమ్య. ఆమెకి దుఃఖం పొంగుకొచ్చింది.

"ఇవన్నీ నీకు ఎవరు చెప్పారు?" తమాయించుకుంటూ అడిగింది సౌమ్య.

"స్వయంగా సుధాకరే. నిన్న బస్టాండులో కలసినప్పుడు చెప్పాడు" అంది గాయత్రి.

సౌమ్య విసురుగా లేచి సుధాకర్ దగ్గరికి నడిచింది. అప్పటి వరకూ కొలీగ్‌తో కబుర్లు చెబుతున్న సుధాకర్ ఆమెని చూడగానే మాటలాపేసి వెటకారంగా నవ్వాడు. మిగతావాళ్ళు అదోలా చూశారు. అందరి ప్రవర్తనలోనూ ఆమెకి ఒకే భావం ద్యోతకమయింది. తనది 'లూజ్ క్యారెక్టర్' అన్న ఫీలింగ్ మిగతావాళ్ళకి కూడా ఇంజక్ట్ చేస్తున్నాడీ రోగ్. సరైన ట్రీట్‌మెంట్ ఇవ్వాలి అని మనసులో అనుకుని ఎంత వేగంగా వెళ్ళిందో అంతే వేగంగా వచ్చి సీట్లో కూర్చుంది సౌమ్య. అప్పటికప్పుడు వెళ్ళి భర్తను పట్టుకుని భోరున ఏడ్చేయాలనిపించింది. సాయంత్రం వరకూ అన్యమనస్కంగానే గడిపింది. ఎంత వద్దనుకున్నా సుధాకర్ నవ్వు ఆమెని వెంటాడుతూనే వుంది.

** ** ** ** **

నీలిరంగు బెడ్‌లైట్ వెలుగు గదంతా ఆవరించుకుని వుంది. తలతిప్పి భర్త వైపు చూసింది సౌమ్య. మూర్తి ఆదమరిచి నిద్రపోతున్నాడు. ప్రొద్దుట భర్తని గురించి సుధాకర్ అన్న మాటలు గుర్తొచ్చాయి.

"వాళ్ళాయన అస్సలు బాగోడు. కురూపిలాగా వుంటాడు. ఈవిడ చూస్తే సినిమా హీరోయిన్‌లా వుంటుంది. కేవలం డబ్బు కోసం పెళ్ళి చేసుకుందట. ఇప్పుడు తాజాగా మేనేజర్‌కి ట్రయల్ వేస్తోంది" అన్నాడు సుధాకర్.

'ఆయన రూట్‌లోకి వచ్చేశాడా?" ఎవరో అడిగారు బేవార్స్‌గా.

"ఆ అందం చూసి ఎలాంటి మగాడైనా పడి తీరాల్సిందే!" సుధాకర్ అంటుంటే సౌమ్య సెక్షన్‌లోకి అడుగుపెట్టింది. వాళ్ళు మాటలాపేశారు.

వీడు చేసిన వెధవ ప్రపోజల్‌కి ఒప్పుకోలేదని అందరి దగ్గరా తన గురించి ఇలా చెబుతాడా? దేవుడి లాంటి భర్తని అవమానించి మాట్లాడతాడా? ఏమిటి నేను చేసిన తప్పు? దీనికంతటికీ కారణం తను అందంగా వుండడం! చిన్నప్పుడు అద్దంలో చూసుకుని మురిసిపోయిన రూపం పదిరెట్లై "ఛీ" కొడుతున్నట్టు తోచిందామెకి. తన శరీరం మీద తనకే అసహ్యం వేసింది.

ఒక్కసారిగా దుఃఖం పొంగుకొచ్చింది. భర్తకు దగ్గరగా జరిగి నుదుటి మీద చిన్నగా ముద్దుపెట్టుకుంది. ఆమాత్రానికే కదలి ఆమెని దగ్గరికి తీసుకున్నాడు మూర్తి.

వెక్కిళ్ళు వినిపించనివ్వకుండా చాలా జాగ్రత్త పడింది. అతను మళ్ళీ నిద్రపోయాడని నిర్ధారించుకున్న తర్వాత మెల్లగా అతన్నించి తప్పించుకుని కిచెన్‌లోకి వచ్చింది సౌమ్య. ఆలస్యం చేయకుండా కిరోసిన్ డబ్బా అందుకుని తనమీది నుంచి వంపుకుంది. మూసుకున్న కళ్ళవెనుక భర్త ప్రేమ, సంస్కారం అద్దంలో ప్రతిబింబాలుగా కన్పించాయి.

చప్పున కళ్ళు తెరిచింది. ఎదురుగా అగ్గిపెట్టె. ఒకే ఒక్క వుల్ల. తన జీవితం ఫినిష్. దానితోపాటు నా మూలంగా ఆయన మీద పడ్డ మచ్చని కూడా చెరిపేయ్ భగవాన్. అగ్గివుల్ల వెలిగించింది. 'ష్' అన్న శబ్దంతో వెలిగిందది. అప్పడొచ్చాడు మూర్తి. గబుక్కున దాన్ని ఆర్పేయబోయాడు. కాని అప్పటికే మంటలు పైకి లేచాయి.

** ** ** ** **

సుధాకర్ సెక్షన్‌లోకి వెడుతూ సౌమ్య సీటువైపు చూశాడు. ఆమె గత వారం రోజులుగా ఆఫీసుకి రావట్లేదు. కొంపదీసి ఉద్యోగం మానేసిందా? ఒక్క క్షణం బాధపడ్డా తర్వాత మామూలుగా సీట్లోకొచ్చి కూర్చున్నాడు. కాసేపటికి ఫోన్ మోగింది. తీసి 'హలో!' అన్నాడు.



"నేను సౌమ్యని" అట్నుంచి వినబడింది.

సీట్లో నిటారుగా అయ్యాడు సుధాకర్.

"చెప్పండి" మామూలుగా వుండడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"మీరు నా గురించి చెడుగా ప్రచారం చేస్తున్నారని తెలుసు. ఇదంతా నామీద వుండే 'ప్రేమ' అని గ్రహించడానికి ఇన్ని రోజులు పట్టింది నాకు. మీరొకసారి వస్తే అన్నీ మాట్లాడుకుందాం. వస్తారా!" సౌమ్య మాటలు విని అతని గొంతులో తడారిపోయింది.

"వస్తాను ఎక్కడున్నారు మీరు" అడిగాడు పొడిగా.

"సర్వోదయా హాస్పిటల్" చెప్పిందామె.

"హాస్పిటలా! ఏమైంది?" కంగారుగా అడిగాడు.

"ఇక్కడైతే సేఫ్‌కదాని.." అట్నుంచి నవ్వు.

"అరగంటలో అక్కడుంటాను" ఫోన్ పెట్టేశాడు సుధాకర్.

** ** ** ** **

సుధాకర్ హాస్పిటల్‌కి వెళ్ళగానే కాంపౌండర్ ఎదురొచ్చి "మీరేనా సుధాకర్?" అనడిగాడు. ఔనన్నట్టు తలూపాడు.

"సౌమ్య గారు ఆ రూమ్‌లో వున్నారు" వేలితో చూపించి వెళ్ళిపోయాడతను.

సుధాకర్ గదిలోకి వెళ్ళాడు. కొంచెం చీకటిగా వుందక్కడ. సౌమ్య వెనక్కి తిరిగి నిల్చుని వుంది. దగ్గరగా వెళ్ళి చిన్నగా దగ్గాడు. ఆమె వెనక్కి తిరిగింది. అతను పలకరింపుగా నవ్వబోయి అప్రయత్నంగా కెవ్వుమని కేకేశాడు. ఓ అడుగు వెనక్కి వేశాడు.

ఆమె ముఖమంతా కాలిపోయి వికృతంగా వుంది. నవ్వుతుంటే తెల్లటి పళ్ళు భయంకరంగా కన్పిస్తున్నాయి. నోట మాట రానట్టు చూస్తున్నాడామెని. సౌమ్య అంది.

"చిన్న ఫైర్ ఆక్సిడెంట్. ఇన్నాళ్ళూ దేముడిలా కొలిచిన నా భర్త నన్నిక్కడ పడేసి ఇప్పటివరకూ చూడడానికైనా రాలేదు. ఈ వారం రోజులూ ఒంటరిగా నాలో నేనే కుమిలి పోయాను. దుఃఖంతో వున్నప్పుడు గుర్తొచ్చిన వారే నిజమైన స్నేహితులంటారు. మీరు పదే పదే గుర్తుకురాసాగారు. మీ ప్రేమని గుర్తించలేకపోయాను. క్షమించండి.

నా భర్త ఎలాంటి వాడో, వారి నిజస్వరూపం ఏమిటో ఇప్పుడర్థమౌతోంది..."

ఆమె క్షణం ఆగి బాధగా కాలిన భాగాన్ని స్పృశించుకుని 'అబ్బా!" అంది తిరిగి కొనసాగించింది.

"ఆయన చేసిన మోసాన్ని భరించలేకపోతున్నాను. నన్నీ నరకం లోంచి బయటకు తీసుకెళ్ళిపోండి ప్లీజ్" చేతులు జోడించింది.

చర్మం కాలిపోయి వికృతంగా వున్న ఆ చేతిని చూడగానే కడుపులో దేవినట్టయింది. మరో రెండడుగులు వెనక్కి వేశాడు సుధాకర్.

"మాట్లాడరేం?" రెట్టించిందామె.

"అదే ..ఎలా..అని. ముందు మీ భర్తతో మాట్లాడి..." తడుముకుంటూ అన్నాడు సుధాకర్.

'ఆయనతో మాట్లాడతారా. ఇదిగో ఇక్కడే వున్నారు. ఏమండీ.." తల వెనక్కి తిప్పి పిలిచింది. పక్క రూంలోంచి మూర్తి వచ్చాడు. సుధాకర్ కంగారుపడిపోయాడు.

"నేను మళ్ళీ వస్తాను..." సౌమ్యకి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా వెనక్కి తిరిగాడు. గుమ్మం దాటుతుంటే సౌమ్య మాటలు వినిపించాయి.

"ఒక్కసారి వెనక్కి తిరిగి చూసి వెళ్తే బావుంటుందేమో..."

అనుమానంగానే వెనక్కి తిరిగి కొయ్యబారిపోయాడు. గదంతా ఆవరించుకున్న వెలుగులో సౌమ్య ఎప్పటిలానే వుంది. కాలిన గాయం తాలూకు మచ్చ కూడా లేదు. స్వచ్ఛంగా నవ్వుతున్న అందమైన ముఖం. నోరావలించుకుని చూస్తున్న అతనికి అభిముఖంగా వచ్చి అంది సౌమ్య.

'సుధాకర్. మీకు కొంచెం కూడా తెలివి లేనట్టుందే! మీరు ఆశపెట్టిన డబ్బులో కొంత ఖర్చు పెట్టి కాస్మొటిక్ సర్జరీ చేయిస్తే నేను యధారూపంలోకి వచ్చేస్తానన్న ఆలోచనైనా రాలేదా! మరి సెక్షన్ హెడ్‌వి ఎలా అయ్యావు?. నువ్వెళ్ళి మేనేజర్ భార్య కాళ్ళు పట్టుకున్నావా! లేక నీ భార్య చేత ఆయన కాళ్ళు పట్టించావా! చెప్పు?" ఆమె ఆవేశంతో ఊగిపోతోంది.

మూర్తి అనునయంగా భుజం తట్టాడు. అయినా ఆమె వూరుకోలేదు.

"నీకు దొరకని స్త్రీ మీద నిందలు వేసే నీలాంటి నీచమైన మనసుకు ఎవరైనా సర్జరీ చేస్తే బావుండును. ప్రపంచంలో అందరూ నీలాంటి మగవారే వుంటారనుకోను. నా భర్త లాంటి బంగారు తండ్రులు కూడా వుంటార్రా! స్వల్ప గాయాలతో హాస్పిటల్‌లో చేర్చి, ప్రాణంగా చూసుకున్న ఆయన చెబితేనే ఈ నాటకం ఆడాను. ఆశించగానే దొరకడానికి ఆడదేమీ వస్తువు కాదు. స్పందించగలిగిన మనిషి. ఇంకెప్పుడూ పరాయి స్త్రీ జోలికి వెళ్ళకు" చెప్పి లోపలికి వచ్చేసింది.

పరుగులాంటి నడకతో వెళ్ళిపోతున్న సుధాకర్‌ని చూసి పగలబడి నవ్వసాగింది సౌమ్య. ఆ నవ్వు అతడిని జీవితాంతం వెంటాడుతూనే వుంది.